క్లుప్తంగా

వైభవంగా ఏకాదశి పూజలు



అలంకరణలో రుక్మిణీ పాండురంగస్వామి

పామిడి: పట్టణంలోని చిన్న విఠోబ దేవాలయంలో రంగసుభే ఫిర్కా ఆధ్వర్యంలో సోమవారం ఏకాదశి పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా భగవాన్ రుక్మిణీ పాండురంగస్వామి విగ్రహాన్ని శోభాయానంగా అలంకరించారు. వేదపండితుడు సూర్యనారాయణ మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక అభిషేకార్చనలు, పూజలు చేశారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భావసార క్షత్రియ భజన మండలి ఆలాపించిన దైవ సంకీర్తనలు భక్తులను పరవశింపజేశాయి. కార్యక్రమంలో ఈఓ కృష్ణయ్య, ఆలయ కమిటీ సభ్యులు, అధ్యక్షుడు టీటీ నాగభూషణ్‌రావు, కార్యదర్శి టీటీ శ్రీనివాసరావు, యూ మంజునాథ్‌రావు, జే వెంకటేశ్వరరావు, భజన మండలి అధ్యక్షుడు మురళిసుందర్, పీ నగేష్, మహిళా మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆలయం వద్ద అన్నదానం



వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద అన్నదానం చేస్తున్న దృశ్యం

పుట్లూరు: మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద సోమవారం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఆలయ అభివృద్ధి కోసం ప్రతి సోమవారం అన్నదాన కార్యక్రమం చేపడుతున్నట్లు బీజేపీ అసెంబ్లీ కో కన్వీనర్ కందు శ్రీనివాసులరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పూజారి నాగప్ప, దాతలు ఆర్.ఓ బులేశు, బి.రామాంజనేయులు, నాగేశ్వరరెడ్డి, రాముడు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా తిరుమల రామచంద్ర జయంతి



మాట్లాడుతున్న ఈఓ రాముడు

గుంతకల్లు: స్థానిక ఏపీఎస్ఎస్‌పీ కార్యాలయంలో పట్టణంలోని భారతి సాహిత సమితి ఆధ్వర్యంలో తిరుమల రామచంద్ర 111వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈఓ రాముడు, వి.గంగరాజు, నాయకుడు జీఎంపీ చలపతి తదితరులు తిరుమల రామచంద్ర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుడు, రచయిత, బహుబాషాభివేత్త రామచంద్ర తెలుగుతో పాటు తమిళం, కన్నడ. సంస్కృతం తదితర భాషాల్లో మేటి కవి అని గుర్తు చేశారు. కార్యక్రమంలో సమితి నాయకులు పి.రామారావు, టీఎం మాధవరావు, సిద్దప్ప, పాటిల్ వేణుగోపాల్‌రెడ్డి, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు పీఎం కిసాన్ నిధుల విడుదల

గార్లదిన్నె: ప్రధానమంత్రి నరేంద్రమోదీ మంగళవారం పీఎం కిసాన్ నిధులు విడుదల చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్ తెలిపారు. సోమవారం ఏఓ మాట్లాడుతూ సాయంత్రం 4 గంటలకు రైతుల ఖాతాల్లో రూ.2 వేలు జమ చేస్తారన్నారు. అలాగే ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రారంభోత్సవ ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో ఉన్న స్మార్ట్ టీవీలో రైతులు వీక్షించవచ్చాన్నారు. అదేవిధంగా అన్ని గ్రామాల రైతు భరోసా కేంద్రాల్లో రైతులు ప్రత్యక్ష ప్రసారం చూడవచ్చునన్నారు.

పరామర్శ



మృతదేహానికి నివాళులర్పిస్తున్న వీరాంజనేయులు

పామిడి: పట్టణంలోని చాకలీవీధిలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కేవీ రమణారెడ్డి(45) కుటుంబాన్ని సోమవారం ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ ఎం.వీరాంజనేయులు పరామర్శించారు. గుత్తి హైవేలోని బాట సుంకలమ్మ ఆలయ సమీపాన గత ఆదివారం జరిగిన కారు–స్కూటర్ ఢీ రోడ్డు ప్రమాదంలో పామిడివాసి కేవీ రమణారెడ్డి మృతి చెందిన విషయం విదితమే. పామిడిలో మృతదేహం వద్ద వీరాంజనేయులు నివాళులర్పించారు. అనంతరం మృతుడి భార్య, కుమారుడు, కుమార్తెను పరామర్శించారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లో ముస్లింలు బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో చేసుకున్నారు. ఈ సందర్భంగా ఖాజీలు, మతపెద్దలు, గురువులు మాట్లాడుతూ త్యాగానికి ప్రతీకగా బక్రీద్ నిర్వహిస్తారన్నారు. ప్రతి ఒక్కరూ దైవ ప్రవక్త బోధనలను అనుసరించాలని ఈ పండుగ గుర్తు చేస్తుందన్నారు. ఈ సందర్భంగా అల్లా గొప్పతనాన్ని, ప్రాముఖ్యతను, పండుగ పవిత్రతను వివరించారు. ప్రార్థనల అనంతరం పరస్పరం ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా ఈద్గాలు, మసీదులు ముస్లింలతో కిక్కిరిసిపోయాయి. అనంతరం నిరుపేదలు, అనాథలకు వస్త్రదానం, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

- ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు
- కిటకిటలాడిన ఈద్గాలు



తాడిపత్రిలోని ఈద్గాలో ముస్లింల సామూహిక ప్రార్థన



శింగనమల ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



గుంతకల్లు: ఈద్గా మైదానంలో ప్రార్థన చేస్తున్న ముస్లింలు



గుత్తిలోని ఈద్గాలో ..



గుత్తి ఆర్ఎస్‌లోని ఈద్గాలో..



పెద్దపప్పూరు ఈద్గాలో..



బుక్కరాయసముద్రంలో..

గుంతకల్లుటౌన్: పట్టణంలో బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం పట్టణంలోని ఈద్గా మైదానం, హజరత్ మస్తాన్‌వలి దర్గా, ఎఫ్‌సీఐ గోడౌన్ ఎదురుగానున్న ఈద్గాలకు ముస్లింలు పెద్ద సంఖ్యలో చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈద్గా మైదానంలో పట్టణ ప్రభుత్వ ఖాజీ సయ్యద్ రజాక్ పీర్ సాహెబ్ బక్రీద్ ప్రార్థనలు జరిపించారు. స్థానిక ఎమ్మెల్యే జయరామ్ ఈద్గా వద్దకు చేరుకుని ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. బక్రీద్ సందర్భంగా ఈద్గాల వద్ద పోలీసులు గట్టి భద్రతా చర్యలు చేపట్టారు. అదనపు ఖాజీ సత్తార్ సాబ్ తదితరులు పాల్గొన్నారు.

బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే వైవీఆర్

ముస్లింలకు మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం పలువురు ముస్లిం మైనార్టీ నాయకులు వైవీఆర్‌ను ఆయన నివాసంలో కలిసారు. ఈ సందర్భంగా ఆయన స్వీట్ బాక్స్‌ను అందజేసి పండుగ శుభాకాంక్షలు చెప్పారు. కౌన్సిలర్ జేసీబీ చాంద్‌బాషా, వార్డు ఇన్‌చార్జ్ పీఎస్.మస్తాన్, నాయకులు నూర్‌నిజామి, చాంద్‌పీరా, షాబుద్దీన్, బాబు తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు రూరల్: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోనూ ముస్లిం సోమవారం బక్రీద్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మండలంలోని పాతకొత్తచెరువు, నక్కనదొడ్డి, వైటీ చెరువు ఈద్గాల్లో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

గుత్తి: గుత్తి మున్సిపాలిటీ పరిధిలో సోమవారం ముస్లింలు బక్రీద్ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గుత్తి, ఆర్ఎస్ లలోని ఈద్గాలతో అదే విధంగా చెట్నేపల్లి, ఎస్ఎస్ పల్లి మసీదుల్లో ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేశారు.

గుత్తి రూరల్: మండలంలోని కొత్తపేట, ఊటకల్లు, అబ్బేదొడ్డి, బేతాపల్లి, రజాపురం, మాముడూరు, జక్కలచెరువు, తొండపాడు గ్రామాల్లో సోమవారం బక్రీద్ (ఈదుల్– జుహా) పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఈద్గాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

శింగనమల: మండలంలో ముస్లింలు బక్రీదు పండుగను సోమవారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. శింగనమలలోని ముస్లింలు ఉదయం 8 గంటలకు అసార కట్ట నుంచి ఈద్గా వరకు ర్యాలీగా తరలివెళ్లారు. ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి వచ్చి మసూద్ గాజి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే గోవిందరాయునిపేట, సోదనపల్లి, ఈస్ట్ నరసాపురం, సలకంచెరువు, రాచేపల్లి, తరిమెల, కల్లుమడి, ఆకులేడు, లోలూరు, పెరవలి గ్రామాల్లో ముస్లింలు బక్రీదు పండుగ జరుపుకున్నారు. ఈద్గా వద్ద ముస్లింలకు సర్పంచ్ నాగమునెమ్మ తాగునీటి సౌకర్యం కల్పించారు.

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా సోమవారం బక్రీద్ పండుగను ముస్లింలు ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా ముస్లింలు మసీదు, ఈద్గా మైదానాల్లో ప్రార్థనలు చేశారు.

పెద్దపప్పూరు: మండలంలోని నరసాపురం, చీమలవాగుపల్లి, పెద్దపప్పూరు, పెద్దయక్కలూరు, ముచ్చుకోట, వరదాయపల్లి, అమ్మలదిన్నె, కుమ్మెత తదితర గ్రామాల్లో సోమవారం బక్రీద్ పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు.

తాడిపత్రి అర్బన్: పట్టణంలో సోమవారం బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముస్లింలు ఈద్గాలకు వెళ్లి సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మత గురువులు బక్రీద్ సందేశమిచ్చారు. మసీదుల్లో ప్రార్థనల అనంతరం స్థానికంగా సయ్యద్ మస్తాన్‌వలి, సిద్దిబాషా దర్గా, యాసిన్‌వలి దర్గాలో ముస్లింలు పాతేహాలు చదివించి ప్రార్థనలు చేశారు.

యాడికి: యాడికి, పెద్దవడుగూరు మండలాల్లో ముస్లింలు బక్రీద్ పండుగను ఘనంగా నిర్వహించారు. యాడికి మండల కేంద్రంలో కోన రోడ్డులోని ఈద్గా మైదానం, రాయల చెరువులోని ఈద్గా మైదానంలో ఉదయమే ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పెద్దవడుగూరు మండలంలో జామియా మసీదు నుంచి ముస్లింలు ఈద్గాకు నడుచుకుంటూ వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈద్గాల వద్ద యాడికి అప్ గ్రేడ్ పీఎస్ సీఐ నాగార్జునరెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు.

పామిడి: పామిడిలో సోమవారం ముస్లీంలు త్యాగానికి ప్రతీకైన బక్రీద్ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లింలను ఉద్దేశించి ఫేష్మామ్‌లు ప్రసంగించారు.

యల్లనూరు: ముస్లిం సోదరులు అత్యంత పవిత్రమైన త్యాగానికి ప్రతీకగా మారిన బక్రీదు పండుగను ఊరూ వాడ జరుపుకున్నారు. సోమవారం యల్లనూరు, వెన్నపూసపల్లి, నిట్టూరు, పెద్దమల్లేపల్లి, తిరుమలాపురం, కల్లూరు, శింగవరం, తిమ్మంపల్లి తదితర గ్రామాల్లో ముస్లిం సోదరులు మసీదులను, ఈద్గాలను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కోడుమూర్తికి వెళ్లే దారిలో చెరువుకట్ట వద్ద ఈద్గాలో యల్లనూరు ముస్లిం మత పెద్ద ప్రభుత్వ ఖాజీ మహమ్మద్ అస్లాం, ఇమాం రసీదు నూరీలు ప్రార్థల అనంతరం ఆలింగనం చేసుకున్నారు. ఎలాంటి గొడవలు జరుగకుండా పుట్లూరు సీఐ సుబ్రహ్మణ్యం సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేయించారు.

బుక్కరాయసముద్రం: బక్రీదు సందర్భంగా మండల కేంద్రంలోని మస్జిదే ఫాతిమా, ఇస్లాంపూర్ కాలనీ, మస్జిదే బందా నవాజ్, గాంధీ నగర్ కాలనీల్లో ఉన్న మసీదుల్లో ముస్లింలు పార్థనలు నిర్వహించారు. అలాగే మండలవ్యాప్తంగా ముస్లింలు బక్రీద్ వేడుకలు చేపట్టారు.



పామిడి మసీదులో..



ముస్లిం నాయకులకు శుభాకాంక్షలు తెలుపుతూ స్వీట్ బాక్స్ అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వైవీఆర్



యల్లనూరులో ప్రార్థనల్లో పాల్గొన్న చిన్నారులు



యాడికిలో ఈద్గా వద్ద..



గుంతకల్లు రూరల్: వైటీ చెరువు ఈద్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు



గుత్తి రూరల్: కొత్తపేట ఈద్గాలో నమాజ్‌కు వచ్చిన ముస్లింలు



పెద్దవడుగూరులో ర్యాలీగా ఈద్గాకు వెళ్తున్న ముస్లింలు

రక్తదాన శిబిరాలకు స్పందన



రక్తదానం చేస్తున్న హైదరాబాద్ వాసి గోపరాజు శ్రీనివాసరావు, తదితరులు

గుంతకల్లుటౌన్: బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని రెడ్‌డ్రాప్ రక్తదాతల సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని మూడు ఈద్గాల వద్ద సోమవారం ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాలకు విశేష స్పందన లభించింది. ముస్లింల పట్టణ ప్రభుత్వ ఖ్వాజీ సయ్యద్ రజాక్‌పీర్ సాహెబ్ ప్రారంభించిన శిబిరాల్లో 240 మంది రక్తదానం చేశారు. కాగా హైదరాబాద్‌కు చెందిన రక్తదాత గోపరాజు శ్రీనివాసరావు 250వ సారి (ప్లేట్‌లేట్స్‌తో కలిపి), అందరివాడు మహేందర్‌రెడ్డి 99వ సారి రక్తదానం చేసి అందరికీ ఆదర్శంగా నిలిచారు. రక్తదాన శిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్యే జయరామ్ రక్తదాతలను అభినందించారు. కార్యక్రమంలో రెడ్‌డ్రాప్ రక్తదాతల సంస్థ వ్యవస్థాపకుడు రెహమాన్, అధ్యక్షుడు గులామ్ మహమ్మద్, కార్యదర్శి షఫీ. ఉపాధ్యక్షుడు చింతాదివాకర్, కోశాధికారి మనోహర్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కేశవ్‌కు ఘన స్వాగతం

గుత్తి/గుత్తి రూరల్/పామిడి/గార్లదిన్నె: రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టాక మొదటిసారి పయ్యావుల కేశవ్ గుత్తికి వచ్చారు. టీడీపీ శ్రేణులతో పాటు జిల్లాలోని ఎమ్మెల్యేలందరూ కేశవ్‌కు ఘన స్వాగతం పలికారు. మొదట బాటు సుంకులమ్మ దేవాలయంలో పూజలు చేశారు. అనంతరం అక్కడి నుంచి గుత్తిలోకి వచ్చారు. ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి గాంధీ సర్కిల్ వరకూ రోడ్ షో నిర్వహించారు. గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం కాసేపు ప్రసంగించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇస్తానన్నారు. అంతకుముందు గుత్తి మండలంలోని కరిడికొండ గ్రామ శివారులో జిల్లా సరిహద్దు వద్ద మంత్రికి టీడీపీ శ్రేణులు సోమవారం ఘన స్వాగతం పలికాయి. అనంతరం ఆయనక పామిడి, గార్లదిన్నెలో టీడీపీ నాయకులు స్వాగతం పలికారు.

కళలను ప్రోత్సహించాలి



తాము గీచిన చిత్రాలను ప్రదర్శిస్తున్న చిన్నారులు

అనంతపురం కల్చరల్: నగరంలోని ఆదర్శ స్కూల్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో సోమవారం లలితా కళా ఉత్సవాల ముగింపు వేడుక సందడిగా జరిగింది. స్థానిక పీస్ మెమోరియల్ హాలు వేదికగా చివరి రోజు చిత్రకళ, నృత్యకళ, సంగీతం, చదరంగం, హ్యాండ్ రైటింగ్ తదితర వాటిల్లో అపార ప్రతిభతో చిన్నారులు ఆకట్టుకున్నారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన పురావస్తు శాఖ ఏడీ రజిత, సీఐ జాకీర్ మాట్లాడారు. చిన్నారులను అద్భుతంగా సృజనకారులుగా తీర్చిదిద్దుతున్న చిత్రకళా మాస్టర్ వినోద్‌కుమార్ కృషిని అభినందించారు. తల్లిదండ్రులు ఎంతో ప్రోత్సహిస్తున్నందు వల్లే ఇంతమంది తమలోని ప్రతిభను చాటుకునే అవకాశం వచ్చిందన్నారు. తల్లిదండ్రులు పిల్లల్లోని కళలను ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ట్ మాస్టర్ అజయ్, భార్గవ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో రైతు మృతి



మృతిచెందిన రైతు శివయ్య

యల్లనూరు: మండలంలోని ఆరవేడు గ్రామానికి చెందిన రైతు బయన్నగారి శివయ్య(55) గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. శివయ్య మూడెకరాల పొలం ఉంది. సోమవారం పొలం పనులు చేసుకునేందుకు వెళ్లాడు. ఉన్న ఫలంగా అతడు కుప్పకూలి పడిపోవడంతో కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించారు. పొలంలోనే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య రామలక్షుమ్మ, ముగ్గురు సంతానం. అందరికీ వివాహాలయ్యాయి. శివయ్యకు ఆరవేడు గ్రామంలో అంత్యక్రియలు పూర్తి చేసినట్లు బంధువులు తెలిపారు.

నేడు 'గ్రీవెన్స్'

శింగనమల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 9 గంటలకు గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తామని, మండలంలోని అధికారులందరూ హాజరు కావాలని ఎంపీడీఓ వెంకటరాముడు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామన్నారు.

ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌ఎస్‌యూ నాయకుడు వంశీయాదవ్

గుంతకల్లు: అధిక ఫీజు వసూలు చేస్తున్న పట్టణంలోని పలు ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ వంశీయాదవ్, ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ నాయకుడు వెంకట్‌నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక వైవీఆర్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అధిక ఫీజులు వసూళ్ల చేయడంతోపాటు పాఠ్య పుస్తకాలను అధిక ధరలకు విక్రయిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. విద్యా హక్కు చట్టం ప్రకారం 25 శాతం ఉచిత విద్యను అందించాల్సిన ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లు నిబంధనలు తుంగలో తొక్కుతున్నాయని విమర్శించారు. ఫీజుల పట్టికను ప్రతి పాఠశాలలో ఏర్పాటు చేయాలన్న నింబంధనను ఎక్కడా అమలు చేయడం లేదన్నారు. ఇంత జరుగుతున్నా విద్యాశాఖ అధికారులు చూసీ చూడనట్టుగా వ్యహరించడం అన్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి నింబంధనలు ప్రకారం ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల నడుచుకోనే విధంగా చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనకు చేపట్టతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు శ్యాంసుందర్, నరసింహ పాల్గొన్నారు.

సెలవులో ఎస్ఐ

యల్లనూరు: యల్లనూరు ఎస్ఐ గిరిబాబు అనారోగ్యంతో సెలవు పెట్టారు. ఎన్నికల నేపథ్యంలో ఫిబ్రవరి మొదటి వారంలో ఆయన తిరుపతి నుంచి బదిలీపై యల్లనూరుకు వచ్చారు. ఎన్నికలు పూర్తైన అనంతరం శనివారం నుంచి సెలవులో వెళ్లారు. యల్లనూరు పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జి బాధ్యతలను సీఐ సుబ్రహ్మణ్యం పర్యవేక్షిస్తున్నారు.

శివపార్వతులకు క్షీరాభిషేకం

కూడేరు: కూడేరులో ప్రఖ్యాతిగాంచిన శివ పార్వతుల స్వయంభు జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం జోడు లింగాలకు విశేష పూజలు చేశారు. తొలుత ఆలయ అర్చకులు జోడు లింగాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం పుష్పాలతో జోడు లింగాలను ఆకర్షణీయంగా అలంకరణ చేశారు.

రోడ్డు ప్రమాదంలో నెమలి మృతి



మృతి చెందిన నెమలిని అటవీ శాఖ అధికారులకు అప్పగిస్తున్న ఎస్ఐ గోపాలుడు

అనంతపురం: నేషనల్ పార్క్ సమీపంలో జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదంలో నెమలి మృతి చెందింది. నెమలి రోడ్డు దాటే క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో అక్కడిక్కడే చనిపోయింది. సమాచారం అందుకున్న మూడో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ గోపాలుడు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మారెప్ప మృతి చెందిన నెమలిని స్వాధీనం చేసుకున్నారు.